


# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

" అందుకని మనిద్దరం చాలా ధైర్యంగా, నెమ్మదిగా ఉండాలి. ఏ విషయమైనా అన్ని విషయాలూ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. మనసులో ఎంత బాధ ఉన్నా కూడా పైకి కనబడనీయకుండా, ముఖ్యంగా పిల్లలకి మన మనసులోని వ్యధ తెలియకుండా మెలగాలి. లేదంటే అది మనల్ని కృంగదీసి మన ధైర్యాన్ని లాగేస్తుంది . ఏమంటావు?" అన్నాడు కళతప్పిన ఆమె ముఖం వైపు చూస్తూ.

అప్పటివరకూ నెమ్మది చిక్కబట్టుకుంటున్న రాధిక అతని మాటలని వినలేనట్టుగా దిగులు పడింది.

అంతలోకే తెలియని ధైర్యం తెచ్చుకున్నట్టుగా మళ్ళీ నెమ్మదిగా తల ఊపింది.

" అదీ, నా రాధి అంటే ఇలా ఉండాలి" అన్నాడు అనునయంగా.

" పిల్లలు వచ్చేస్తారేమో, వాళ్ళు వినకుండా చూసుకోవాలి అనుకున్నాం కదా. ఇప్పటినించీ ఈ మాటలన్నీ వాళ్ళు నిద్ర పోయాకా పెరట్లో కూర్చునో, లేదా వాళ్ళు స్కూల్ కి వెళ్ళాకో మాట్లాడుకుందాం." అంది రాధిక గొంతు తగ్గించి చాలా నెమ్మదిగా.

అంతలోనే ఆటలకెళ్ళిన స్వప్ని, సాహిల్ రానేవచ్చారు.

అలసిపోయి, దస్సిపోయినట్టున్న స్వప్నికనీ, 'ఇంకా ఆటలు చాల్లేదు, అక్కే తీసుకొచ్చేసిందని' ఫిర్యాదు చేస్తున్న సాహిల్ ని లోపలకి వెళ్ళి ముఖాలు కడుక్కుని బట్టలు మార్చుకోమని పంపింది రాధిక.

కొద్ది కొద్దిగా ధైర్యాన్ని కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్న భార్యని చూసి స్థిమిత పడ్డాడు కిరణ్.

పిల్లలు పడుకున్నాకా, దాదాపు తెల్లవారేవరకూ రక రకాల విషయాల మీద మాట్లాడుకుంటూనే ఉన్నారు వాళ్ళు.

భోజనాలు చేసి రాత్రి పదిగంటలకి వచ్చారు శేఖర్, రోహిణి.

రాత్రుళ్ళు ఒకరిళ్ళల్లో మరొకరూ చాలా సేపటివరకూ ఉండడం, ఒక్కోసారి అందరూ అక్కడే ఉండిపోవడం కొత్త కాదు ఆ రెండు కుటుంబాలకీ.

అయినా త్వరగా వచ్చి ఆ విషయాలు పిల్లల ముందే మొదలు పెట్టడం ఇష్టం లేక, వాళ్ళు పడుకున్నాకా వస్తామనే చెప్పారు ముందే.

పిల్లలిద్దరూ పడుకున్నాకా, తలుపులు దగ్గరగా వేసి వచ్చింది రాధిక.

ముందు గదిలో కూర్చున్నారు అందరూ.

తలగడలు, దుప్పట్లూ తెచ్చి ఒక పక్కగా పెట్టింది రాధిక.

నలుగురూ కలిసి నెమ్మదైన గొంతులతో' ప్రస్తుత పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి? ఏం చెయ్యాలి?' అన్న విషయాలే మాట్లాడుకుంటూ ఉండిపోయారు.

మాట్లాడుకునే కొద్దీ అవి రక రకాల దారుల్లో తిరుగాడాయే తప్ప స్థిరమైన పరిష్కారాన్ని చూపించలేకపోయాయి.

స్నేహితుల కోసం, ముఖ్యంగా వారి పిల్లల కోసం కావాలంటే ప్రాణాలనైనా ఇవ్వగలరు శేఖర్, రోహిణీ.

కానీ ఇప్పుడు కావలసినది డబ్బు. అది వాళ్ళ దగ్గర మితంగానే ఉంది.

అది తల్చుకుంటేనే ఎంతో బాధ తన్నుకు వచ్చింది వాళ్ళకి.

" నేను ఆ ప్రావిడెంట్ ఫండ్ మీద లోన్ తీసుకుంటాను" అన్నాడు కిరణ్.

" మంగళసూత్రాల గొలుసుతో సహా నా బంగారాన్ని అమ్మేద్దాం" అంది రాధిక.

" నా బంగారం కూడా తాకట్టు పెట్టడమో, అమ్మేయడమో ఏది వీలైతే అది చేద్దాం" అంది రోహిణి.

ఆ మాటలకి కిరణ్, రాధికా వెంటనే 'వద్దు రోహిణీ!' అన్నారు ఒకేసారిగా.

" ఎందుకు వద్దు అంటున్నారు? మేమేమీ పరాయి వాళ్ళం కాదు కదా,స్వప్ని మాకూ కూతురే. దయచేసి నో అనకండి" అంది రోహిణి బాధగా.

స్నేహితురాలి చెయ్యి పట్టుకుంది రాధిక.

"అబ్బే! అలా అని కాదు రోహిణీ, అంతగా అవసరం అయితే తప్పకుండా చేద్దాం, ప్రస్తుతానికి దాన్ని పక్కన పెడదాం అని" అన్నాడు కిరణ్

" మా అన్నయ్య ఈ మధ్యనే తన స్థలమొకటి అమ్మాడు, వాడిదగ్గర తప్పకుండా డబ్బు ఉంటుంది, పైగా నేనడిగితే కాదనడు కూడా. అడుగుతాను". అన్నాడు శేఖర్.

" నాన్నగారిని, మావయ్యగారిని కూడా అడుగుదాం, కావాలంటే నేనేదైనా ఉద్యోగం చూసుకుంటాను. ఏమంటారు?" అంది రాధిక

ఇప్పుడు స్వప్నిక ఉన్న పరిస్థితిలో రాధిక ఆమెతో చాలా సమయం గడపడం, పాపకి కావలసినవన్నీ దగ్గరుండి చూసుకోవడం, ముఖ్యంగా తల్లిగా ఆమెకి కావలసిన ధైర్యాన్ని పంచడం చాలా ముఖ్యం. అందుకని ఇప్పుడు ఉన్నట్టుంది రాధిక ఉద్యోగం చూసుకోవడం అనేది అంత మంచి ఆలోచన కాదని అనుకున్నారు.

మరికొన్ని ఆలోచనల తర్వాత, ఇంకేం చెయ్యగలరో వాళ్ళకి తట్టలేదు. ఎవరి ఆలోచనల్లో వారు మౌనంగా ఉండిపోయారు

అందరినీ నిద్రకమ్ముకునేవరకూ మౌనం రాజ్యమేలింది ఆ గదిలో.

అలసిపోయిన ఆ నలుగురూ సోఫా మీదా, నేలమీదా సొమ్మసిల్లిపోయినట్టు ఎక్కడివారక్కడే పడుకుండిపోయారు.

కళ్ళల్లోకి పొడిచినట్టుగా కిటికీలోంచి సూర్యకిరణాలు పడుతుండడంతో బద్ధకంగా నిద్ర లేచాడు కిరణ్.

" అరే, బాగా పొద్దెక్కిందే?" అనుకుంటూ చుట్టూ చూశాడు. మిగతా ముగ్గురూ కనబడలేదు.

" లేచారా? కాఫీ ఇవ్వనా?" అంటూ వచ్చింది రాధిక.

" పిల్లలేరి? టైమెంతైంది?" అన్నాడు కిరణ్.

" స్కూల్ కి వెళ్ళిపోయారు. బయాలజీ లో ఏదో ముఖ్యమైన టెస్ట్ ఉంది, తప్పకుండా వెళ్తాను అంది స్వప్ని. బాగానే ఉంది ఈ రోజు. రోహిణి టిఫిన్ చేసిచ్చింది, తినేసి వెళ్ళారు." అంటూ చెప్పింది రాధిక.

" బాగానే ఉంది ఈ రోజు" చెవులకి అమృతంలా సోకిన ఆ మాటలనే మననం చేసుకుంటూ " ఈ బాగానే ఉండడం శాశ్వతమైపోతే ఎంత బావుండును!" అనుకున్నాడు.

మరో పదినిమిషాల్లో వచ్చారు శేఖర్, రోహిణీ.

"కొన్నాళ్ళపాటు వంటపని అదీ పెట్టుకోకు, నేనూ శేఖర్ చూసుకుంటాం" అంది రోహిణి వస్తూనే.

నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది రాధిక. " ఎంత పుణ్యం చేస్తే ఇలా స్వంతవాళ్ళని మించిన స్నేహితులు దొరుకుతారు? నువ్వు నా సోల్ సిస్టర్ వి రోహిణీ" అంది కృతజ్ఞతగా.

" మనమధ్యలో ఇలాంటి మాటలెప్పటినించి తల్లీ?" అన్నాడు శేఖర్ వాతావరణాన్ని తేలికపర్చడానికి.

"అయినా ఇప్పుడు మనం ఆలోచించాల్సింది వీటిగురించి కాదు. నంబర్ల గురించి" అన్నాడు మళ్ళీ తనే.

రాత్రి తను పడుకున్న సోఫాలోనే కొద్దిగా పైకి లేచి కూర్చుని ముగ్గురి మాటలు వింటున్న కిరణ్ పక్కకి ఒత్తిగిల్లి, లేచి కూర్చునే ప్రయత్నంలో కాళ్ళు నేల మీదకి ఆనించాడు. కుడిచెయ్యి బోటుగా తన తలకింది పెట్టుకున్న చిన్న దిండు మీద పెట్టాడు.

సోఫాకి, తన దిండుకీ మధ్యన ఏదో గట్టిగా తగిలింది అతని చేతికి.

అదేమిటో కనబడకుండా అతని చేతిరుమాలు కప్పి ఉంది.

దాన్ని తొలగించి అక్కడ 'ఏముందా?' అని చూశాడు.

నీలం, ఎరుపు రంగుల్లో స్పైడర్ మాన్ బొమ్మ.

సాహిల్ ది.

నిజానికి అది కేవలం బొమ్మ కాదు. సాహిల్ డబ్బులు దాచుకునే కిడ్డీ బాంక్.

రాధిక చిన్నప్పటినించీ పిల్లలకి నేర్పిన అలవాటు అది.

ఎప్పుడు కొందో గుర్తులేదు కానీ ఏదో ఎక్జిబిషన్ లో పిల్లలిద్దరూ అడిగిన బొమ్మల్లాంటి కిడ్డీబాంక్ లు కొంది రాధిక. సాహిల్ కి స్పైడర్ మాన్, స్వప్నిక కి తలమీద కుండ పెట్టుకున్న అమ్మాయి.

దాదాపుగా మూడువంతులు నాణాలతో నిండి, బరువుగా ఉన్న స్పైడర్ మాన్ కిడ్డీ బాంక్ ని చేతిలోకి తీస్కున్నాడు కిరణ్.

అప్రయత్నంగానే అతని కంట నీరు తిరిగింది.

" ఎక్కడికి కావాలంటే అక్కడకి ఎగిరి వెళ్ళి అందరినీ రక్షిస్తాడు కదా ఈ స్పైడర్ మాన్! ఇక్కడ తమకేమీ చెయ్యలేడా?" అనుకున్నాడు మొదట.

" ఇదేమిటి? ఇక్కడెందుకుంది ఈ బొమ్మ?" అంది రోహిణి మొదట.

" అదే తెలీదు, తన అలమరలో చాలా జాగ్రత్తగా, అక్కకి కూడా దొరకనంతగా పెట్టుకుంటాడు. ఖాళీ దొరికినప్పుడల్లా చూసుకుంటూ ఉంటాడు. నీకు తెలుసుగా" అంది రాధిక కూడా.

" అమ్మా, ఇది ఎప్పుడు తీస్తానో తెలుసా? నీ 40 వ పుట్టినరోజుకి. అప్పుడు దీంట్లో ఉన్న డబ్బుతో ఒక మంచి గిఫ్ట్ కొంటాను.

అక్క కూడా తన డిబ్బీ అప్పుడే ఓపెన్ చేస్తానంది. ఎందుకో తెలుసా? మనం నలుగురం మంచి రెస్టారెంట్ కి వెళదాం, అక్కడే నీకోసం కేక్ కొని నీ బర్త్ డే జరుపుకుందాం. నీకు ఈ ప్లాన్ అంతా చెప్పేశానని అక్కకి చెప్పద్దు. నీకు సర్ప్రైజ్ అన్నమాట".

కొడుకు చెప్పిన మాటలు గుర్తొచ్చి అంత బాధలోనూ నవ్వొచ్చింది రాధిక కి.

'అంత ప్రాణం వాడికి ఆ డబ్బా అంటే. అలాంటిది దాన్ని ఇలా కిరణ్ కి, తనకీ కనబడేలా పెట్టాడే?' అనుకుంది

అందరి మనసుల్లోనూ ఒకే ఆలోచన వచ్చింది.

" తాము డబ్బు కావాలని అనుకోవడం, దాని గురించి మాట్లాడుకోవడం సాహిల్ కి తెలిసిందా? కొంపదీసి వినకూడనిదేమీ సాహిల్ వినలేదు కదా?" కంగారు పడ్డాడు కిరణ్. అదే మాట అన్నాడు.

" మనం మాములుగా అనుకునే మాటలు విని ఉంటాడు. రాత్రి నిద్రలో వాడిని బాత్ రూం కి తీసుకువెళ్ళినప్పుడో, లేదా మనం గమనించనప్పుడో. మనకి డబ్బు కావాలని వాడి చిన్ని బుర్రకి అనిపించిందేమో" అంది రాధిక.

"అవును, అంతే అయి ఉండాలి, మనం నాలుగు సార్లు డబ్బు, డబ్బు అనుకున్నాము కదా" అంది రోహిణి కూడా.

అదే నిజం కూడా.

సాహిల్ కి అసలు విషయం తెలియదు.

ఈ మధ్యన అమ్మా, నాన్నా ఏదో విషయం గురించి చాలాసేపు మాట్లాడుకోవడం, ఆ మాటల్లో తరచుగా డబ్బు దొర్లడం మాత్రం తెలుసు వాడికి. అందుకే తన దగ్గరున్న 'డిబ్బీలో డబ్బు' ని నాన్నకి తెలియకుండా ఇచ్చేస్తే నాన్నకి సంతోషం కలుగుతుంది అనుకున్నాడు.

ఆ పసివాడి ప్రేమనీ, దానికి సాక్ష్యంగా వాడు వదిలి వెళ్ళిన బొమ్మనీ చూస్తూ ఉండిపోయారు నలుగురూ.

" ఈ రోజు డా.రాజేష్ ని కలుద్దాం అనుకున్నాం కదా. మీరిద్దరూ త్వరగా తయరైతే, టిఫిన్ తిని బయల్దేరదాం. మనలో మనం తర్జనభర్జనలు పడడం కన్నా, ఆయన్నే సలహా అడగడం మంచిదని నా అభిప్రాయం.

డా. సుజిత్ చెప్పిన వివరాలన్నీ మన దగ్గరున్నాయి, డా. రాజేష్ మనకెంతో ఆప్తులు, ఆయన తప్పకుండా మనకి కావలసిన సలహాలిచ్చి, మంచి పరిష్కారాన్ని చూపిస్తారని నా నమ్మకం" అన్నాడు శేఖర్.

" అవును, అన్నయ్య చెప్పింది నిజమే" అంది రాధిక.

" మరో అరగంటలో బయలుదేరదాం, నేను ఫోన్ చేసి ఆయన దగ్గర టైం తీసుకుంటాను. పేషెంట్లతో బిజీ అయిపోకముందే మనం వెళితే కాస్త టైము దొరుకుతుంది మనకి" అన్నాడు శేఖర్.

మరో గంట తర్వాత డా రాజేష్ ఆఫీస్ లో కూర్చుని ఉన్నారు నలుగురూ.

" ప్రతీ విషయానికీ, ప్రతీ సారీ మేము నలుగురూ రావడం మీ ఆఫీసుని ఆక్రమించేయడం మీకు ఇబ్బంది గా ఉండొచ్చు. అందుకు ముందుగా నా క్షమాపణలు డాక్టర్. కానీ ఆ పిల్లలతోనూ, మా స్నేహితులతోనూ మాకున్న అనుబంధం అంత గట్టిది.

వారి సుఖ దు:ఖాలలో ప్రతీ క్షణమూ తోడుగా ఉండాలనే అనుకుంటాము నేనూ రోహిణి. ముఖ్యంగా పిల్లల విషయంలో. అందుకని కాస్త అసౌకర్యమైనా మీరు మమ్మల్ని మన్నించి, ఏమీ అనుకోరని ఆశిస్తాను" అంటూ మొదలు పెట్టాడు శేఖర్.

ఒకరికొకరు చేరి నలుగురూ మాట్లాడి ఆయన విలువైన సమయాన్ని తీసుకోవడం తప్పని అతని భావన. అందుకే అలా అన్నాడు.

అదీ కాక అందరిలోనూ రోహిణి చాలా ఇమోషనల్. పిల్లలమీద పిచ్చి ప్రేమ వల్ల ఒక్కోసారి ఏమంటుందో కూడా తనకే తెలియదు. " కంటేనే పిల్లలా, వాళ్ళిద్దరూ నాకూ పిల్లలే" అని రాధిక తోనే వాదిస్తుంది అప్పుడప్పుడు.

నెమ్మదిగా నవ్వాడు రాజేష్.

" మీరన్నది పూర్తిగా కాదనలేను, మిమ్మల్నీ కాదనలేను. వ్యక్తిగతంగా నాకేమీ పరవాలేదు, కానీ మీరన్నట్టు మిగతా పేషెట్లకి ఇబ్బంది కలగకూడదు. ఈ సారి నించి మనం ముందే నిర్ణయించుకుని ఆ వేళల్లో కలుసుకుందాం. మీ సలహా నాకు నచ్చింది" అన్నాడు ఆయన.

" థాంక్ యూ డాక్టర్" అన్నాడు కిరణ్.

ఆ తర్వాత పది నిమిషాల పాటు తమ ఆలోచనలని ఆయనతో చెప్పారు కిరణ్, శేఖర్.

వాళ్ళిద్దరూ చెప్పినవన్నీ వింటూ కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు ఆయన.

ఆ తర్వాత నిదానమైన గొంతుతో చెప్పడం మొదలుపెట్టాడు.

" మీరన్నది, మీ పరిస్థితి నాకు అర్ధం అయింది. చాలా విషయాలు నాకు ముందే తెలుసు కూడా కదా.

కానీ ఓ రెండు గాజులు అమ్మితేనో, చిన్న లోన్ లు తీసుకుంటేనో తీరే సమస్య కాదు ఇది. మనం ఇంకేదైనావేరేగా ఆలోచించాలి.

మీరన్న మార్గాలు ప్రస్తుతం కొంతవరకూ ఉపయోగ పడవచ్చు కానీ పూర్తిగా కావాలంటే సరిపోవు.

మీ పేరెంట్స్ ని ఈ వయసులో ఇబ్బంది పెట్టడం కూడా మంచి పద్ధతి కాదేమో అని నా అభిప్రాయం. మీరు అడగాలే కానీ ఉన్నదంతా ఇచ్చేస్తారు, నాకందులో ఏమీ సందేహం లేదు" అంటూ ఆగారు ఆయన.

"మీరన్నది నూటికి నూరు పాళ్ళు నిజం డాక్టర్. కానీ మాకింతకన్నా మరేమీ తోచలేదు. మా ఆర్థిక స్థోమత, పెద్దవాళ్ళు చెప్పినా పెద్దగా ప్లానింగ్ చేసుకోలేకపోవడం స్వయంకృతాపరాధం. ఇవన్నీ కూడా కారణాలే" బాధగా అన్నాడు కిరణ్.

" ఊరుకోరా, అలా అనకు. ఎంత చెట్టుకు అంతగాలి, మన జీతాలకి తగ్గట్టే ఉంటాయి కదా, మన జీవితాలు. మీరు చెప్పండి డాక్టర్, మరేమైనా మార్గాలు ఉన్నాయా? ఎలా ప్రయత్నించాలి?" అన్నాడు శేఖర్ కిరణ్ భుజం మీద తడుతూ.

"మీరన్నది నిజమే శేఖర్. అందుకని మరొకటేదైనా చూద్దాం. ఎన్.జీ.వోలో, ట్రస్టులో, క్రౌడ్ ఫండింగ్. ఇలాంటిదేదైనా చూడాలి" అన్నారాయన.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments